క్లుప్తంగా

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

దొనకొండ: మండలంలోని వద్దిపాడు ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు కొన్ని అనివార్య కారణాలతో గతంలో నిలిచి పోయాయి. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అయేషా బేగం ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించి చైర్మన్‌గా జి.మంగమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా హాజరయ్యారు. ఎలాంటి సంఘటనలు జరగలేదు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుల్లలచెరువు: ఈ నెల 31వ తేదీనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మరియదాసు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రకటనలో తెలియచేస్తూ మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 7,798 పింఛన్లు ఉన్నాయని, వాటిని సచివాలయ ఉద్యోగులు శనివారం ఉదయం నుంచే పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2వ తేదీ లోపు 100 శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది అశ్రద్ధ చూపకుండా లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలన్నారు.

పైపులైను లీకుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: స్థానిక ఎన్ఎస్‌పీ కాలువ వద్ద రక్షిత నీటి పైపు లైనుకు ఏర్పడిన లీకుకు శుక్రవారం మరమ్మతులు చేశారు. ఈ నెల 28న సాక్షి దినపత్రికలో రక్షిత నీటికి రక్షణ ఏది అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు శుక్రవారం మరమ్మతులు చేయించారు.

నేత్రదానంపై అవగాహన



ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యాధికారి రవితేజకుమార్

కురిచేడు: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నేత్రదానంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన సదస్సు జనిగింది. వైద్యాధికారి రవితేజకుమార్ అవగాహన కలిగించారు. ర్యాలీని వైద్యాధికారి రవితేజకుమార్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేస్తే భౌతికంగా లేకున్నా తమ కళ్ల ద్వారా జీవించివుండి ఇతరుల జీవితాల్లో ఆనందాన్ని నింపవచ్చన్నారు. కళ్లజోడు పెట్టుకునే వారు, మధుమేహం, అధిక బ్లడ్‌ప్రెషర్ ఉన్నవారు, ఉబ్బసం వ్యాధితో బాధపడే వారు కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకొన్నవారు కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరికి కంటిచూపు లభిస్తుందన్నారు. సీహెచ్‌ఓ జి. కృపమ్మ, ఆప్తాలమిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, ఏ.గురుస్వామి, కోటేశ్వరి, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

3న డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 3వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ట్రో డ్రగ్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్, టీసీఎల్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని చెప్పారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన 19 నుంచి 30 ఏళ్ల మధ్య గల వారు దరఖాస్తు చేసకోవాలన్నారు. పూర్తి వివరాలకు 92474 33273, 99499 14337 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ప్రకటించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాల్లో నిర్వహించాల్సి ఉంది. శుక్రవారం కౌన్సిల్ సమావేశానికి ముగ్గురు వైఎస్సార్ సీపీ, ఒక టీడీపీ, మరో కోఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. గత నెలలో కూడా కౌన్సిల్ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసిన విషయం తెలిసిందే.

సాగర్ జలాలు ఉన్నా సాగు నీరివ్వరా?



త్రిపురాంతకం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

త్రిపురాంతకం: సాగర్ జలాలు ఉన్నా సాగు నీరు విడుదల చేయడం లేదని, గ్రామాల్లో పేరుకున్న పారిశుధ్యంతో ప్రబలుతున్న వ్యాధులు, విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ జి. రిబకమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి ఎంపీటీసీలు కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులను పలు సమస్యలపై ప్రశ్నించినా సరైన సమాధానాలు చెప్పేవారే లేకుండా పోయారు. గతంలో సర్వసభ్య సమావేశాలకు అధికారులు, ఎంపీటీసీలు పాల్గొనేవారు. ఇప్పుడు సభ్యులు అడిగిన ప్రశ్నలకు నామమాత్రంగా సమాధానాలు చెప్పడం విమర్శలకు దారితీస్తోంది. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ భ్రమరాంబ, ఎంఈఓ టి.రాజశేఖరరెడ్డి, ఈఓఆర్‌డీ మురళీమోహన్ పాల్గొన్నారు.

నామమాత్రంగానే మండల పరిషత్ సమావేశం

త్రిపురాంతకం మండల పరిషత్ సమాశం ఎప్పుడూ వాడీవేడిగా జరిగేది. అలాంటిది సమావేశాలు నామమాత్రంగానే అధికారులు మమ అనిపించేశారు. అడిగే వారికి చెప్పేవారు కరువయ్యారు. మండల పరిషత్‌లో 18 మంది సభ్యులు ఉన్నారు. సభ్యులంతా వైఎస్సార్ సిపికి చెందిన వారే. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఇటీవల ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఒప్పందం ప్రకారం తదుపరి ఉపాధ్యక్షురాలు ఆళ్ల సుబ్బమ్మ ఈ పదవిలోకి రావాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మండల పరిషత్‌లో మరో ఉపాధ్యక్షురాలు జి.రిబకమ్మకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రిబకమ్మ ఈ పదవిలో కొనాసాగుతోంది. ఆళ్ల సుబ్బమ్మ మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి భార్య. ఈ వర్గం సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. ప్రస్తుతం మండల పరిషత్ అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న రిబకమ్మను ఈ పదవి అనూహ్యంగా వరించిందని చెప్పవచ్చు. ప్రస్తుతం జరుగుతున్న మండల పరిషత్ రాజకీయాలతో నామమాత్రంగానే సమావేశాలు జరగుతున్నాయి.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



సైడు కాల్వలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఉమామహేశ్వరపురం వద్ద విద్యార్థుల స్కూల్ బస్ అదుపుతప్పి కూరుకు పోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం సరస్వతి విద్యా సంస్థల బస్ ఈదర, పూరిమెట్ల గ్రామాల విద్యార్థులతో తాళ్లూరు వెళ్తుండగా మార్గంమధ్యలో ఉమామహేశ్వరపురం మలుపు వద్ద విద్యుత్ స్తంభాన్ని తప్పించబోయి సైడు కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో విద్యార్థులు ఉలిక్కపడ్డారు. డ్రైవర్ బస్‌ను నిలిపి వేయడంతో విద్యార్థులు కిందకు దిగారు. అదే సమయంలో అద్దంకి డిపోకి చెందిన ఆర్‌టీసీ బస్ ఈదర వెళ్తుండగా ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. రెండు గంటల తర్వాత బస్‌ను ట్రాక్టర్ సహాయంతో బయటకు తీయడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

సీసీ కెమెరా దిశ మారింది



నాడు.. 28వ తేదీన ఇలా



నేడు... సరిచేసిన తర్వాత సీసీ కెమెరా

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా దిశ మారడంపై ఈ నెల 28వ తేదీన 'ఈ పక్కచూపులు ఎవరికోసమో..' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం సీసీ కెమెరా దిశను సరి చేశారు. శాంతి భద్రతలు, నేరగాళ్ల కదలికలు, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ చొరబాట్లు తదితర విషయాలను పరిశీలించేందుకు సీసీ కెమెరాలను పకడ్బందీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

● రేంజి అధికారి ప్రసన్న జ్యోతి



పెద్ద మంతనాలలో మొక్కలు నాటుతున్న రేంజి అధికారి

పెద్దదోర్నాల: మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యతని కొర్రప్రోలు రేంజి అధికారి ప్రసన్నజ్యోతి పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని పెద్ద మంతనాల ప్రభుత్వ గిరిజన ప్రాథమికోన్నత ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులు అంతరించి పోతే పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడి మానవుని జీవనానికి పెద్ద ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మానవుని మనుగడ, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని ఆమె పిలుపు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కల పెంపకమే శరణ్యమన్నారు. ప్రతి సంవత్సరంలో ఒక రోజు ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ భూమని చిన్న వెంకటమ్మ, ఐటీడీఏ కో ఆర్డినేటర్ మంతన్న, ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు. మండల కేంద్రంలోని నూతన మండల పరిషత్ కార్యాలయంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి మోహన్‌రావు, అటవీశాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



మర్రివేముల పాఠశాలలో నాటుతున్న మొక్కలు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

పుల్లలచెరువు: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం వనం మనం కార్యక్రమంలో భాగంగా మర్రివేముల జెడ్పీ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఏపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని, వృక్షోరక్షితి రక్షితః అని పెద్దలు అన్నారంటే వృక్షాలు నాటండి.. అవి మిమ్మల్ని కాపాడుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన తహసీల్దార్

దర్శి: నగర పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో వనం మనం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

వక్ఫ్ భూముల ఆక్రమణపై విచారణ

కంభం: విలువైన వక్ఫ్, దేవాలయ భూములు ఆక్రమణలకు గురువుతున్నా రెవెన్యూ అధికారులు స్పందిచడం లేదని గత నెల 27వ తేదీన ఒంగోలులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం మైనారిటీ అండ్ వక్ఫ్‌బోర్డ్ డిప్యూటీ కలెక్టర్ డి.నారాయణ కంభం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని చెబుతున్న సర్వే నంబర్లకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలి హోటల్ దగ్ధం

● సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం



బూడిదగా మారిన హోటల్, సామగ్రి

దర్శి: గ్యాస్ సిలిండర్ పేలి హోటల్ దగ్ధమైంది. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అలవలపాడు గ్రామానికి చెందిన శారద వెంకటాచలంపల్లి ఊరు శివారులో హోటల్, మరో బంకు ఏర్పాటు చేసుకుని ఉదయం టిఫిన్, మధ్యాహ్నం కిచిడీ వంటి ఆహార పదార్థాలు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తోంది. హోటల్లో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి పెద్ద మంటలు వచ్చాయి. హోటల్లో ఉన్న సామగ్రి మొత్తం దగ్ధమైంది. బంకు కూడా కాలిపోయింది. ఫైర్ స్టేషన్ నుంచి ఫైరింజన్ వచ్చే సరికి బంకు, హోటల్ సామగ్రి కాలి బూడిదైంది. రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, బాధితురాలికి ప్రభుత్వం సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెలుగు భాషా పరిరక్షణ అందరి బాధ్యత



డాక్టర్ వీరారెడ్డిని సన్మానిస్తున్న మధుసూదన్, తదితరులు

● విశ్రాంత ఆర్జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి

మార్కాపురం: తెలుగు భాషా పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరారెడ్డి మాట్లాడుతూ.. సాంస్కృతిక పరిరక్షణకు మాతృభాషా సాహిత్యమే కీలకమన్నారు. డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి పంతులు స్ఫూర్తితో తెలుగు భాషకు తగిన గుర్తింపు, గౌరవం ఉండేలా అందరూ కృషి చేయాలన్నారు. తెలుగు అధ్యాపకుడు జి.వినోద్, డాక్టర్ శేషుకుమార్, ఎంపీ రాఘవేంద్ర, శ్రీధర్, పోలిరెడ్డి, మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవల్లో బీజేపీని బలోపేతం చేయండి



మాట్లాడుతున్న తిండి నారాయణరెడ్డి

తాళ్లూరు (దర్శి): బూత్ లెవల్లో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి కోరారు. తాళ్లూరు పట్టణంలో బీజేపీ మండల స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తిండి నారాయణరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ రెండో తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభిస్తారన్నారు. ఆరోజు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. బూత్ లెవల్లో ప్రతి పంచాయతీలో సభ్యత్వ నమోదు చేయడం కోసం ప్రతి మండల స్థాయి నాయకుడు సపోర్ట్ చేయాలన్నారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని, అలాంటి పార్టీకి ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుంటే పట్టణాలతో పాటు పల్లెలు కూడా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు, ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి జేష్టాది ఆంజనేయులు, దర్శి రూరల్ మండల అధ్యక్షుడు కాకర్ల సాయి, మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు చందోలు రామారావు, మారం గోవిందరెడ్డి, ఉప్పరపల్లి వేమారెడ్డి, ఎస్సీ మోర్చ నాయకులు నరశింహారావు పాల్గొన్నారు.